సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



టార్గెట్ పూర్తిచేయాలి

వన మహోత్సవంలో టార్గెట్ పూర్తి చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. 8లో▸



డ్రైవర్ల సంక్షేమమే ధ్యేయం

ప్రమాదబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ సలావుద్దీన్ అన్నారు. 8లో▸



నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ దామోదర్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

పంటల నమోదులో పారదర్శకత పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



కొందుర్గు రైతు వేదికలో సిబ్బందితో మాట్లాడుతున్న గీతా రెడ్డి

కొందుర్గు: పంటల నమోదులో పారదర్శకత పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి గీతా రెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు రాచం ద్రాపూర్, వెంకిర్యాల గ్రామాలను గురువారం ఆమె సందర్శించి ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఎప్పటికప్పుడు స్టాకు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. అనంతరం కొందుర్గు రైతువేదికలో ఏఈఓలతో సమావేశమయ్యారు. ప్రతిరోజు ఉదయం విధిగా పొలాలకు వెళ్లి, పంటల నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మధ్యాహ్నం రైతువేదికల్లో రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. అర్హులైన ప్రతిరైతుకు బీమా చేయించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మొదటి విడతలో 49,741 మంది, రెండో విడతలో 22,915 మంది రైతులకు రుణమాఫీ అయిందని వెల్లడించారు. షాద్‌నగర్ బరోడా బ్యాంక్‌కు సంబంధించి సాంకేతిక లోపంతో మొదటి విడత రుణమాఫీ పొందిన రైతుల ఖాతాల్లో ఇంకా డబ్బులు జమ కాలేదని, త్వరలోనే జమ అవుతాయని తెలిపారు. రుణమాఫీలో ఏమైనా ఇబ్బందులుంటే రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజారత్నం, ఏఓ రవినాథ్, ఏఈఓలు కోటేశ్వరరావు, వాసవి, అనూష పాల్గొన్నారు.

'వెల్ఫేర్' నిధులను దుర్వినియోగం చేయొద్దు

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

తలకొండపల్లి: కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను దుర్వినియోగం కాకుండా చూడాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ డిమాండ్ చేశారు. కార్మికుల అవసరాలకు మాత్రమే ఖర్చు చేయాలని, ఇతర శాఖలకు కేటాయించొద్దని అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ గేట్ వద్ద ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల మండల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రమాద మరణానికి ప్రస్తుతం కార్మికులకు ఇస్తున్న రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని.. ప్రసూతి, వివాహ కానుకలను రూ.30 వేల నుంచి రూ.లక్షకు పెంచాలని కోరారు. ఇసుక, సిమెంట్, స్టీల్, పెయింట్ తదితర ముడి సరుకుల ధరలను నియంత్రించాలన్నారు. కార్మిక శాఖలో బ్రోకర్ల వ్యవస్థను నిర్మూలిస్తూ, అర్హులైన కార్మికులందరికీ నష్ట పరిహారం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కామ్రేడ్ కృష్ణమూర్తి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు చెన్నయ్య, భవన నిర్మాణ నాయకులు లక్ష్మయ్య, కృష్ణయ్య, రామస్వామి, పెంటయ్య, మాజీ సర్పంచ్‌లు శ్రీశైలం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

6న రవీంద్రభారతిలో గద్దర్ ప్రథమ వర్ధంతి

పంజగుట్ట: గద్దర్ అంటే ఒక పాట, ఆటే కాదు ఆయన ఒక ఉద్యమ స్ఫూర్తి అని తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న రవీంద్రభారతిలో గద్దర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని గద్దరన్న యాదిలో పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు, గద్దర్ కుమారుడు సూర్య కిరణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఎంపీ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్‌రెడ్డి, గాయకుడు, కవి ఏపూరి సోమన్నలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. గద్దర్ ప్రతమ వర్ధంతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రులను, అన్ని పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు అల్లం నారాయణ తెలిపారు. గద్దర్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.





నైపుణ్యానికి పునాది

బేగరికంచెను ఫ్యూచర్ సిటీగా మారుస్తాం

- న్యూయార్క్‌కు దీటుగా నెట్ జీరో సిటీ రూపుదిద్దుకుంటుంది
- వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, పీహెచ్‌సీ, మోడ్రన్ స్కూల్, కమ్యూనిటీ సెంటర్లకు శంకుస్థాపన



స్కిల్ యూనివర్సిటీ భవన నమూనాలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి తదితరులు

కందుకూరు: ఇప్పటి వరకు ఓ సాధారణ బేగరికంచె.. ఇకపై ఫ్యూచర్ సిటీగా మారబోతోంది. న్యూయార్క్‌కు దీటుగా రూపుదిద్దుకోబోతుంది. వచ్చే నాలుగేళ్లలో ఈ కుగ్రామం మరో మహానగరంగా ఆవిష్కృతం కాబోతోంది. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నెట్ జీరో సిటీ అభివృద్ధిలో భాగంగా మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ, బేగరికంచె జీపీ పరిధిలో ప్రభుత్వం ప్రతిపాదించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సహా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోడ్రన్ స్కూల్, కమ్యూనిటీ సెంటర్లకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు దీటుగా ఈ ప్రాంతంలో నాలుగో నగరం రాబోతోంది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను పలు క్లస్టర్లుగా విభజించి ఫార్మా విలేజ్‌లు దర్శనం ఇవ్వబోతున్నాయి. ఎత్తైన బహుళ అంతస్తుల భవనాలు, జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు, ఉద్యోగుల నివాసాలు, ఆస్పత్రులు, క్రీడా మైదానాలు, హోటళ్లతో ఈ ప్రాంతం అలరించబోతోంది. అందమైన పార్కులు, విశాలమైన రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో రైలు సేవలతో మరో నాలుగేళ్లలో కాలుష్యరహిత నగరం కళ్ల ముందు ఆవిష్కృతం కాబోతోంది.

రోడ్డు విస్తరణ బాధ్యత కేఎల్ఆర్‌కు..


నెట్ జీరో సిటీ నుంచి ఓఆర్ఆర్ వరకు 200 అడుగుల ఎలివేటెడ్ కారిడార్ రోడ్డుకు భూసేకరణ బాధ్యతలు మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌కు అప్పగిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో కేఎల్ఆర్ అభిమానులు పెద్ద ఎత్తున జై కేఎల్ఆర్, జై కాంగ్రెస్ అని నినదించారు.

రెండున్నర గంటలు ఆలస్యంగా..

స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన ఉండగా, మంత్రి మండలి సమావేశం కారణంగా 6.26 గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం 3 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న అధికారులు, అభిమానులకు నిరీక్షణ తప్పలేదు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, నిర్మలారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కేఎల్ఆర్, కోదండరెడ్డి, తీగల కృష్ణారెడ్డి, చిన్నారెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మేయర్ పారిజాత, సీనియర్ నాయకులు బొక్క జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఎస్.మల్లేష్, కృష్ణనాయక్, ఐఎస్‌బీ ఫౌండర్ శ్రీనిరాజు, గ్రీన్ బిల్డింగ్స్ కౌన్సిల్ శేఖర్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, కలెక్టర్ శశాంక, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

గణనీయంగా తగ్గిన 'విద్యుత్' ఫిర్యాదులు

టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఫారూఖీ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు సంబంధించిన ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. 2023 జనవరి-జూన్ మధ్యకాలంలో 5,83,672 ఫిర్యాదులు రాగా, ఈ ఏడాది ఇదే కాలవ్యవధిలో 3,97,934 ఫిర్యాదులు అందినట్టు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 31.82 శాతం ఫిర్యాదులు తగ్గినట్టు చెప్పారు. సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా 2023 జనవరి-జూన్ మధ్యకాలంలో 35,949 ఫిర్యాదు రాగా, ఈ ఏడాది ఇదే కాల వ్యవధిలో 60.96 శాతం తగ్గుదలతో 14,035 ఫిర్యాదులొచ్చాయని అన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లు, 1912 టోల్ ఫ్రీ నంబర్ కాల్ సెంటర్ పనితీరుపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు గాను 1912 టోల్ ఫ్రీ కాల్ సెంటర్‌తో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటున్నామని వెల్లడించారు. 213 ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్ల కార్యాలయాల సిబ్బంది ఉపయోగించే వాహనాల్లో యాప్ ఆధారిత జీపీఎస్ సాంకేతికను అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే సిబ్బంది సంబంధిత ప్రాంతానికి చేరుకుని సత్వర చర్యలు తీసుకుంటున్నారా? లేదా? అనే అంశంపై సమీక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, బిల్లింగ్ ఫిర్యాదులు, బ్రేక్ డౌన్ సమాచారం, ఫీడర్ల సమాచారం, బిల్లింగ్/ కలెక్షన్ సమాచారం వంటి వివరాలతో కూడిన సమీకృత డాష్ బోర్డును అందుబాటులోకి తెచ్చామన్నారు. దీంతో రియల్ టైంలో సమాచారం తెలుసుకునే వీలుంటుందన్నారు. 1912 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లలో 74 మంది సుశిక్షిత ఆపరేటర్లను అందుబాటులో ఉంచి బలోపేతం చేశామన్నారు. ఏకాలంలో 400 ఫిర్యాదులు స్వీకరించే రీతిలో సామర్థ్యం పెంపొందించామన్నారు. ఫిర్యాదుదారులకు కంప్లైంట్ నంబర్ సైతం ఎస్ఎంఎస్ ద్వారా పంపిస్తామని ఆయన వివరించారు.



లారీలో తరలిస్తున్న ఎర్రమట్టి


ఎర్రమట్టి.. కొల్లగొట్టి!

- ప్రభుత్వ భూమిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- జేసీబీలతో తవ్వి లారీల్లో యథేచ్ఛగా తరలింపు
- 'సొమ్ము' చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకునేవారే కరువు

మొయినాబాద్: ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. విలువైన ఎర్రమట్టిని తరలించుకుపోయి 'క్యాష్' చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూ సర్వేనంబర్ 218లో ప్రభుత్వ భూమి ఉంది. అందులో నుంచి అక్రమార్కులు రాత్రి, పగలు తేడా లేకుండా జేసీబీలతో లారీల్లో ఎర్రమట్టిని నింపి ఫాంహౌస్‌లకు తరలించుకుపోతున్నారు. మూడు రోజులుగా యథేచ్ఛగా వందల లారీల ఎర్రమట్టి తరలిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రస్తుతం గ్రామాల్లో క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థ లేదు. దీంతో ప్రభుత్వ భూముల్లో ఏం జరుగుతుందో రెవెన్యూ అధికారులకు సమాచారం ఉండడం లేదు. అధికారులు ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ భూములను పరిశీలించే పరిస్థితి లేదు. ఇదే అదునుగా అక్రమార్కులు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను వివరణ కోరగా పెద్దమంగళారంలో ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వుతున్నట్లు సమాచారం వచ్చిందని.. పరిశీలించి మట్టి తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సుప్రీం తీర్పు హర్షణీయం

ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ అన్నారు. కోర్టు తీర్పు వెల్లడించిన నేపథ్యంలో గురువారం షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో ఎంఆర్పీఎస్ నేతలు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం నాయకులు స్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని అన్నారు. చివరికి న్యాయం, ధర్మమే విజయం సాధించిందని అన్నారు. వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ నేతృత్వంలో ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని అన్నారు. పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారని, కోర్టు తీర్పును అమరులైన వారికి అంకితం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి విద్య, ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ పూర్తయ్యే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, ఆనంద్, అశోక్, శ్రీను, నాగభూషణ్, బాల్‌రాజ్, పాండు, రమేష్, శ్రీను, జాంగారి రవి, ఇప్పలపల్లి దర్శన్, రవికుమార్, పరమేష్, సిద్ధు, శ్రీనివాస్, ప్రసాద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరీక్షణకు తెర

- ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వం పచ్చజెండా
- జిల్లాలో లక్షల్లో పెండింగ్ దరఖాస్తులు
- నాలుగు దశల్లో వాటి పరిశీలన
- నాలుగేళ్ల ఎదురుచూపులకు ముగింపు
- త్వరలో కలగనున్న మోక్షం



క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన

షాద్‌నగర్: లేఅవుట్ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. మూడు నెలల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలుగు దశల్లో దరఖాస్తులను స్క్రూటినీ జరపాలని నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సర్కార్ నిర్ణయంతో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం లభించనుంది.

భారీగా దరఖాస్తులు

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్లాట్లను చాలా మంది కొనుగోలు చేశారు. అక్రమ లేఅవుట్‌లలో ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగస్టు 31, 2020న జీఓ నంబర్ 131 జారీ చేసింది. ఈ జీఓకు ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున దరఖాస్తులు అందాయి. కార్పొరేషన్ల పరిధిలో 57,583, మున్సిపాలిటీల పరిధిలో 1,77,829, గ్రామ పంచాయతీల నుంచి 2.21లక్షల అప్లికేషన్లు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేశారు. ప్రభుత్వ ఖజానాకు అప్పట్లో భారీగా ఆదాయం వచ్చింది.

దరఖాస్తుదారుల ఆనందం

ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ కోర్టు కేసుల కారణంగా ముందుకు సాగలేదు. నాలుగేళ్లుగా ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఏళ్లుగా దరఖాస్తులు చేసుకున్న వారు ఎదురు చూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం నుంచి ప్లాట్ల క్రమబద్ధీకరణకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడనుంది.

క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ప్రభుత్వం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌ను రూపొందించింది. దీని ద్వారా అధికారులు నాలుగు దశల్లో దరఖాస్తులను పరిశీలించనున్నారు. మొదటి దశలో నిషేధిత భూములతో దరఖాస్తులను సరిపోల్చనున్నారు. నిషేధిత జాబితాలో ప్లాట్లు ఉంటే అలాంటి దరఖాస్తులను తిరస్కరించనున్నారు. ఆ తర్వాత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటి పారుదల శాఖ ఏఈ, టౌన్ ప్లానింగ్, పంచాయతీ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి దరఖాస్తులను పరిశీలిస్తారు. ప్రభుత్వ, వక్ఫ్ బోర్డు, దేవాదాయ, అసైన్డ్ భూములు, ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయా అన్న విషయాలను పరిశీలిస్తారు. అధికారులు వద్ద ఉండే ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా జీపీఎస్ వివరాలతో దరఖాస్తులను స్క్రూటినీ చేయనున్నారు. మొదటి దశలో పరిశీలించిన దరఖాస్తులను రెండోదశలో టౌన్ ప్లానింగ్, పంచాయతీ అధికారులు పరిశీలిస్తారు. ఈ దశలో మాస్టర్ ప్లాన్, రోడ్ల విస్తరణ, జోన్ నిబంధనలు అన్నీ సక్రమంగా ఉంటే లేఅవుట్ ఫీజును నిర్ణయిస్తారు. మూడో దశలో లేఅవుట్ ఫీజు చెల్లించిన దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్‌లు, పట్టణాభివృద్ధి సంస్థల వైస్ చైర్మన్లు, అదనపు కలెక్టర్లు పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుంటే చివరగా అనుమతి కోసం ఉన్నతాధికారుల ఆమోదానికి పంపిస్తారు. నాలుగో దశలో కింద స్థాయి అధికారులు పంపిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ కమిషనర్లు పరిశీలించి ఆమోదిస్తారు.

గతంలో అందిన దరఖాస్తులు

కార్పొరేషన్ /మున్సిపాలిటీ	దరఖాస్తులు
బడంగ్‌పేట	46,894
బండ్లగూడ	7,324
మీర్‌పేట	3,365
ఆదిబట్ల	14,886
ఆమనగల్లు	3,720
ఇబ్రహీంపట్నం	16,376
జల్‌పల్లి	11,825
మణికొండ	2,532
నార్సింగి	3,635
పెద్ద అంబర్‌పేట	45,951
షాద్‌నగర్	16,450
శంషాబాద్	7,582
శంకర్‌పల్లి	4,881
తుక్కుగూడ	2,429
తుర్కయంజాల్	47,362

నిధుల వరదకు ఆస్కారం

లేఅవుట్ లేని స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ఆదేశాలు రావడంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ప్రభుత్వ నిర్ణయంతో ఊరట



క్రమబద్ధీకరణ కోసం గతంలో ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించాం. నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నాం. ఇప్పటికై నా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.

– ఎండీ ఖాసీం, షాద్‌నగర్

ఎంతో మందికి లబ్ధి



లేఅవుట్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం అభినందనీయం. ప్రభుత్వ నిర్ణయంతో ఎంతో మంది సామాన్యులకు లాభం చేకూరుతుంది.

– సురేష్‌రెడ్డి, షాద్‌నగర్

మార్గదర్శకాలకు అనుగుణంగా..



లేఅవుట్‌ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలిస్తాం. అన్నీ సక్రమంగా ఉంటే ఉన్నతాధికారులు ఆమోదిస్తారు.

– వెంకన్న, మున్సిపల్ కమిషనర్, షాద్‌నగర్

క్లుప్తంగా

సీఎం కృతజ్ఞతా సభకు తరలిరండి

పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

తుర్కయంజాల్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల సమస్య ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదలతో పరిష్కరించారని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరెడ్డి అన్నారు. ఇందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే సీఎం కృతజ్ఞతా సభకు పదోన్నతి పొందిన ఉపాధ్యాయులంతా హాజరవ్వాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 771 మంది ఉపాధ్యాయులు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా, ఎల్‌ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా, ఫిజికల్ డైరెక్టర్లుగా, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారని గుర్తు చేశారు.

తండ్రి మందలించాడని..

యువకుడి అదృశ్యం

కేశంపేట: యువకుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని పోడగుట్ట తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన కేతావత్ బబ్లూ అనే యువకుడు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు.బబ్లూ గత నెల 29న ఉదయం ఇంట్లో నుంచి తినకుండా బయటి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. అయితే తినకుండా ఎందుకు బయటికి వెళ్లావని తండ్రి రవీందర్ కొడుకును మందలించాడు.అదేరోజు రాత్రి బయటికి వెళ్లిన బబ్లూ తిరిగి రాలేదు. కొడుకు ఆచూకీ కోసం ఎంత వెతికిని ఫలితం లేకపోవడంతో తండ్రి రవీందర్ ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బబ్లూ (ఫైల్)

టార్గెట్ పూర్తిచేయాలి

- జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, స్పెషల్ ఆఫీసర్ నవీన్‌కుమార్‌రెడ్డి
- ‘వన మహోత్సవం’లో నాటిన మొక్కల పరిశీలన



దండుమైలారంలో మొక్కలను పరిశీలిస్తున్న నవీన్‌కుమార్ రెడ్డి

ఇబ్రహీంపట్నం: వన మహోత్సవంలో టార్గెట్ పూర్తి చేయాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి, ఇబ్రహీంపట్నం మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురవారం ఆయన మండల పరిధిలోని రాయపోల్, దండుమైలారం, ముకునూర్ గ్రామాలను సందర్శించి కూలీలకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా గుర్తించి, ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. మండల పరిధిలోని 84 వేల మొక్కలను నాటాల్సి ఉండగా ఇప్పటి వరకు 35 వేల మొక్కలను నాటినట్లు చెప్పారు. 51 వేల మొక్కలు నాటేందుకు గుంతలను తీసి పెట్టినట్లు వివరించారు. రాయపోల్ గ్రామంలో నాటిన నాలుగు వేల మొక్కలను పరిశీలించి, మిగిలిన రెండు వేల మొక్కలను ఐదు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ముకునూర్ గ్రామంలోని శ్మశానవాటిక ప్రాంతంలో మొక్కలు నాటుతున్న కూలీలతో ముచ్చటించారు. మొక్కలు నాటే విధానంపై పలు సూచనలు చేసి మరో ఐదు రోజుల్లో 4వేల మొక్కలను నాటి టార్గెట్‌ను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి రాజ్‌కమార్‌ను, దండుమైలారం గ్రామంలో నాటిన మొక్కలను పరిశీలించి మిగిలిన 200 మొక్కలను నాటే పనులు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను ఆదేశించారు. గ్రామ నర్సరీని సందర్శించి ఇంటింటికి మొక్కలను పంపిణీ చేయాలన్నారు. రైతులు పొలం గట్లపై వారికి అవసరమైన మొక్కలు నాటుకుంటే అదనంగా ఆదాయం పొందవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, ఎంపీఓ లక్‌పతినాయక్, ఏపీఓ తిరుపతాచారి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ల సంక్షేమమే యూనియన్ ధ్యేయం

- నేషనల్ ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ సలావుద్దీన్

షాద్‌నగర్‌రూరల్: డ్రైవర్లు ప్రమాదబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ సలావుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటకు చెందిన టాక్సీ డ్రైవర్ సురేశ్ ఇటీవల మృతి చెందాడు. గురువారం స్థానిక టాక్సీ డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో మృతుడి భార్య సురేఖకు రూ.5 లక్షల విలువైన చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ సలావుద్దీన్, టాక్సీ జేఏసీ చైర్మన్ నాగేష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టాక్సీ డ్రైవర్ల సంక్షేమమే యూనియన్ ధ్యేయమన్నారు. ప్రతీ డ్రైవర్ తప్పక ప్రమాదబీమా చేయించుకోవాలన్నారు. ఈ బీమా పాలసీ ఆపదలో కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. యూనియన్‌లకు అతీతంగా ప్రతీ డ్రైవర్‌కు ఇన్సూరెన్స్ చేయించే బాధ్యత యూనియన్ నాయకులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ ఖాజాపాషా, టాక్సీ డ్రైవర్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, శివారెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, విశ్వనాథ్‌శెట్టి, షేక్ మొయినుద్దీన్, ఎండీ.వసీం, ప్రతాప్‌రెడ్డి, మహేశ్, ఈశ్వర్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మృతుడి భార్య సురేఖకు చెక్కు అందజేస్తున్న యూనియన్ నాయకులు



షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డాక్టర్ దామోదర్

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ దామోదర్

షాబాద్: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ దామోదర్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. అనంతరం సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆస్పత్రిని అభివృద్ధి చేశామన్నారు. ఇటీవల ఇద్దరు వైద్యులు నూతనంగా విధుల్లో చేరారని వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రులను తీర్చిదిద్దాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీహెచ్ఓ సంతోష, డాక్టర్ తబుసమ్, సూపర్‌వైజర్ మేరినా, సిబ్బంది తదితరులున్నారు.

లాడ్జీల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

పట్టణ సీఐ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: లాడ్జీల్లో ప్రధాన ప్రదేశాల్లో తప్పక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ సూచించారు. గురవారం ఆయన పట్టణంలోని పలు లాడ్జీల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. లాడ్జీల్లో బస చేసేవారి వద్ద సరైన ధృవపత్రాలు తీసుకోవాలని సూచించారు. లాడ్జీలకు వచ్చే వారి వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. చట్టవిరుద్ధంగా ఎవరికి గదులు ఇవ్వొద్దని అనుమానిత వివరాలు వెంటనే పోలీసులకు తెలిపాలన్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు పోలీసులకు అప్పగించాలన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పట్టణ సీఐ విజయకుమార్

చెట్ల పెంపకంపై నివేదిక అందజేయండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా చెట్ల పెంపకంపై పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణలోగా నివేదిక సమర్పించకుంటే హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ కమిషనర్లను వర్చువల్‌గా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని హెచ్చరించింది. తదుపరి విచారణ ఈ నెల 6కు వాయిదా వేసింది. ‘పట్టణాలు, నగరాల్లో ప్రజల జీవితాలు ఉరుకులు పరుగులుగా మారాయి. ఉపశమనం, ఊరట పొందేందుకు పార్కుల అవసరం ఎంతైనా ఉంది. ఉన్నవాటి పరిరక్షణతో పాటు లేని చోట్ల కొత్తగా ఏర్పాటు చేయాలి. చెట్లను కూడా అభివృద్ధి చేయాలి. ఆ మేరకు ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలి’ అని కోరుతూ హైదరాబాద్ హిమాయత్‌సాగర్‌కు చెందిన కె. ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో 2016లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణలోగా నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్

హస్తినాపురం: మద్యం తాగించి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు శివాజీరెడ్డిని గురువారం వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కాశిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా, ఆరేగూడెం గ్రామానికి చెందిన మునుగాల శివాజీరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. గత నెల 29న తన స్నేహితుడు గౌతంరెడ్డి ఫోన్‌చేసి బొమ్మరిల్లు బార్ అండ్ రెస్టారెంట్‌కు రావాలని అక్కడికి వచ్చాడు. అనంతరం ఇద్దరూ కలిసి మద్యం మత్తులో ఉన్న యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. మత్తు నుంచి తేరుకున్న తర్వాత బాధితురాలు గదిలో గౌతంరెడ్డి తో పాటు మరో వ్యక్తి ఉండడం, తనపై లైంగిక దాడి జరిగినట్లు గుర్తించి గట్టిగా కేకలు వేసింది. దీంతో రెస్టారెంట్ సిబ్బంది పోలీసులకు, యువతి స్నేహితులకు సమాచారం అందించగా, అక్కడికి వచ్చిన ఆమె స్నేహితులు బాధితురాలిని చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్‌లోని ఆరెంజ్ ఆసుపత్రికి తరలించారు. నిందితులు ఇద్దరు అక్కడి నుంచి అక్కడికి పరారైనట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు గౌతంరెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న శివాజీరెడ్డిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

- మరింత సమర్థవంతంగా కాల్ సెంటర్, విద్యుత్ కంట్రోల్ రూమ్ సేవలు

సాక్షి,సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, విద్యుత్ సరఫరా ఫిర్యాదులను అతి తక్కువ కాలంలో పరిష్కరించేందుకు ప్రస్తుతం ఉన్న 1912 కాల్ సెంటర్ (విద్యుత్ కంట్రోల్ రూమ్) ఫ్యూజ్ ఆఫ్ కాల్ వ్యవస్థలో అధునాతన సాంకేతికను అమలు చేస్తున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. గురువారం సంస్థ ప్రధాన కార్యాలయంలో 1912 కాల్ సెంటర్, ఫ్యూజ్ ఆఫ్ కాల్ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సరఫరా సంబంధిత ఫిర్యాదులు, ఇతర ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. సంస్థ పరిధిలో నిర్వహించే కార్యకలాపాలకు సంబంధించి సమీకృత డ్యాష్ బోర్డు ను అందుబాటులోకి తెచ్చామని, రియల్ టైం లో సమాచారం తెలుసుకునే వీలు ఉంటుందన్నారు. ఆరు నెలలుగా నమోదైన సరఫరా సంబంధిత ఫిర్యాదులను, గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది అంతరాయాల ఫిర్యాదులు బాగా తగ్గాయని తెలిపారు. డైరెక్టర్ ఆపరేషన్ నర్సింహులు, చీఫ్ ఇంజినీర్లు శివాజీ, నరసింహ స్వామి, సూపరింటెండింగ్ ఇంజినీర్లు రవి కుమార్, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు రక్ష

డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

కేశంపేట: తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి అన్నారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి డాక్టర్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుట్టిన వెంటనే బిడ్డలకు ముర్రు పాలు తాగించాలని సూచించారు. దీంతో చిన్నారులకు రోగనిరోధక శక్తి పెరుగుతుంని, ఆరోగ్యంగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓ ఉపేందర్‌రెడ్డి, అంజిలమ్మ, హేమలత, చంద్రశేఖర్, రవికుమార్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

గుట్కాలు విక్రయిస్తే కేసులు తప్పవు

సీఐ నర్సింహారావు



తనిఖీలు చేస్తున్న సీఐ, సిబ్బంది

కొత్తూరు: హోటళ్లు, కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో నిషేధిత గుట్కాలు, పాన్ మసాలాలు విక్రయిస్తే చర్యలు తప్పవని కొత్తూరు సీఐ నర్సింహారావు హెచ్చరించారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి పట్టణంలోని హోటళ్లు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. లాడ్జిల్లోనూ తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. నిషేధిత గుట్కాలు, పాన్ మసాలాల వినియోగం ద్వారా ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వీటిని పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ లైన్

- తప్పిన ప్రమాదం
- గృహోపకరణాలు దగ్ధం

ఆమనగల్లు: 33 కేవీ విద్యుత్‌లైన్ వైర్ తెగిపడింది.. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి స్థానిక సూర్యలక్ష్మి కాటన్‌మిల్‌లో విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా 33 కేవీ లైన్ ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన భారత్ పెట్రోల్ సమీపంలో ఓ విద్యుత్ వైర్ అకస్మాత్తుగా తెగిపడింది. దీంతో ఓ ఇంట్లో విద్యుత్ వైరింగ్‌తో పాటుగా టీవీ, ఫ్రిడ్జి పాడయ్యాయి. పక్కనే భూషన్ హోటల్‌లో ఫ్రిడ్జిలు ఇతర సామగ్రి కాలిపోయాయి. తాము తీవ్రంగా నష్టపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక విద్యుత్ ఏఈ సీతారాములు ఘటనా స్థలానికి చేరుకుని వెంటనే విద్యుత్ లైన్ పునరుద్ధరించారు.



ఓ ఇంట్లో దగ్ధమైన విద్యుత్ బోర్డు

తీరనున్న నీటి వెతలు

- గోదావరి జలాల రెండో దశకు గ్రీన్ సిగ్నల్
- మల్లన్నసాగర్ నుంచి 15 టీఎంసీలు తరలింపు
- అందులో 10 టీఎంసీలు నగర తాగునీటి అవసరాలకు
- ఐదు టీఎంసీలు జంట జలాశయాలకు
- రూ. 5,560 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు పనులు

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరానికి మంచి నీటి అవసరాల కోసం గోదావరి తాగు నీటి సరఫరా పథకం-2కు రాష్ట్ర మంత్రి వర్గం పచ్చజెండా ఊపింది. నగరానికి సమీపంలోని మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటిని శామీర్‌పేట ఘన్‌పూర్, అక్కడి నుంచి హైదరాబాద్ కు తరలించే జలమండలి ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. మొత్తంమీద 15 టీఎంసీలను తరలించి, అందులో 10 టీఎంసీలను శుద్ధి చేసి హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు. మిగతా ఐదు టీఎంసీలను నేరుగా జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమయత్‌సాగర్ తరలించి అక్కడి నుంచి మూసీలోకి వదలనున్నారు. నగరంలో రోజురోజుకూ తాగునీటి అవసరాలు పెరుగుతుండడంతో పాటు నాగార్జునసాగర్, సింగూర్, మంజీరా, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల్లో కూడా నీరు సంతృప్తికరంగా లేకపోవడంతో గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు రెండో దశను చేపట్టేందుకు జలమండలి ప్రణాళిక రూపొందించి మల్లన్న సాగర్ నుంచి నీటిని తరలించేలా ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

24 నెలల కాలపరిమితి..

నగరానికి తాగు నీరు తరలించే గోదావరి తాగునీటి సరఫరా పథకం-2ను సుమారు రూ.5,560 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. 24 నెలల కాలపరిమితిలో పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు. సిద్దిపేట జిల్లా, మర్కూక్ మండలంలో కొండపోచమ్మ సాగర్, శామీర్‌పేట్ మండలంలోని ఘనస్‌పూర్‌లో మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, మల్లన్న సాగర్ నుంచి నుంచి ఉస్మాన్ సాగర్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేయడం, క్లియర్ వాటర్ రిజర్వాయర్ల అనుబంధ భాగాలతో 10 టీఎంసీల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ) నిర్మాణ పనులు చేపట్టనున్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో పంపింగ్ మెయిన్స్, మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ల మధ్య ఇంటర్‌కనెక్టివిటీ ఏర్పాట్లు చేయనున్నారు.

ప్రస్తుతం జలాల తరలింపు ఇలా..

హైదరాబాద్ మహా నగరం ఎత్తైన ప్రదేశం కావడంతో పాటు రాళ్లు, కొండలతో నిండి ఉండటంతో భూగర్భ జలాలపై ఆధారపడకుండా వంద కిలోమీటర్ల దూరంలోని నాగర్జున సాగర్ నుంచి మూడు దశల్లో కృష్ణాజలాలు, సుమారు రెండు వందల కిలోమీటర్ల దూరంలోని శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గోదావరి జలాలను తరలిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి సుమారు 75 శాతం వరకు నీటి తరలింపు ఉంటుంది. మరోవైపు జంటజలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌తోపాటు సింగూర్, మంజీరా జలాశయాల నుంచి కూడా నీటి తరలింపు కొనసాగుతోంది. సాగర్ జలాశయం నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా కృష్ణా తాగు నీటి సరఫరా పథకం ఫేజ్ - 1, 2, 3 ల కింద రోజువారీ 270 ఎంజీడీల నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం గోదావరి పథకం ద్వారా నగరానికి 168 ఎంజీడీల నీరు తరలిస్తున్నారు. అయినా నీరు సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో గోదావరి రెండో దశ అనివార్యమైంది.

